క్లుప్తంగా

11న లోక్ అదాలత్



పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఏడీజే మురళీకృష్ణ

రాజంపేట : రాజంపేటలో వచ్చే నెల 11న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి మురళీకృష్ణ తెలిపారు. ఈ లోక్ అదాలత్ నిర్వహణపై శనివారం థర్డ్ ఏడీజే కోర్టులో పోలీసు శాఖతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో జడ్జి సంధ్యారాణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జానీ, డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐలు నరసింహారావు, పుల్లయ్య, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి



రెవెన్యూ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న కొండూరు విజయ్‌రెడ్డి

పెనగలూరు : మండలంలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని మండల వైస్ ప్రెసిడెంటు కొండూరు విజయ్‌రెడ్డి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీలకు అతీతంగా రైతులు ఎలాంటి సమస్యలపై అయినా కార్యాలయానికి వస్తే వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. సచివాలయం స్థాయికి మించి తహసీల్దార్ కార్యాలయానికి వస్తే వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌రావు, ఆర్‌ఐ చంద్రమోహన్‌రెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పాడి ఉత్పత్తులను గణనీయంగా పెంచండి



పాడి రైతులతో మాట్లాడుతున్న ఏపీఎం రెడ్డమ్మ

రామాపురం : గ్రామాల్లో పాడి ఉత్పత్తులను గణనీయంగా పెంచాలని ఎంపీడీఓ హైదర్‌వల్లి సూచించారు. మండలంలోని కల్పనాయినిచెరువులో శనివారం జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై పాడి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పాల ఉత్పత్తి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. పశువులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుంటే వారికి రుణాలు ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఉషారాణి, మండల వైద్య అధికారి సరోజ కీర్తన, ఏపీఎం రెడ్డెమ్మ, సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ, రూట్ ఆఫీసర్లు సురేష్‌కుమార్, సీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష తగదు



అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు

చిట్వేలి : బాలికలపై వివక్ష చూపడం తగదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధామణి తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పాత చిట్వేలి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ బిడ్డలు అన్ని రంగాలలో ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం 'ఆడ పిల్లలను రక్షిద్దాం' అంటూ తల్లుల చేత ప్రమాణం చేయించారు. అలాగే కె కందులవారిపల్లి పంచాయతీలోని బాలాజీ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ నిర్మల, అంగన్‌వాడీ వర్కర్లు సుబ్బలక్షుమ్మ, రాధమ్మ, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మహిళా పోలీసులు అమరావతి, శారద, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

– ఒకరికి తీవ్రగాయాలు

రామాపురం : మండలంలోని బండపల్లి పంచాయతీ వీఆర్ కాలేజీ రోడ్డు వద్ద శనివారం సాయంత్ర ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో అబ్దుల్ అలి అనే వ్యకి తీవ్రంగా గాయపడ్డాడు. సుండుపల్లెకు చెందిన అబ్దుల్ అలి ఆటో డ్రైవర్‌గా జీవనంగా సాగిస్తున్నాడు. శనివారం రామాపురం నుంచి రాయచోటికి వెళుతుంగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద విషయం తెలియగానే లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్ సంఘటన స్థలానికి చేరకున్నారు. 108లో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

అన్నీ చేస్తున్నాం.. ఆశీర్వదించండి

- వెలిగల్లు రిజర్వాయర్ వైఎస్సార్ పుణ్యమే
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపడుతూ, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రజలను కోరారు. శనివారం గరుగుపల్లె, నక్కలవాండ్లపల్లె, ముద్దప్పగారిపల్లె, పెద్దపల్లె, పూజలవాండ్లపల్లె, ఇడపనుచేనువారిపల్లె, ఛాముకూరివాండ్లపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 98 శాతం నెరవేర్చిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అవినీతికి తావు లేకుండా, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలను ఇంటి గుమ్మం వద్దకే చేరుస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత రైతాంగానికి తాగు, సాగునీరు అందిస్తున్న వెలిగల్లు రిజర్వాయర్‌ను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించారని తెలిపారు. గరుగుపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వెలుగల్లు కుడి కాలువను పరిశీలించి, అక్కడ రైతులు సాగు చేసిన పంటలను చూసి సంతోషం వ్యక్తం చేశారు.

అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం

గరుగుపల్లెలో చిన్న, చిన్న సమస్యలను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆవుల నాగభూషణ్‌రెడ్డి, సర్పంచ్‌లు ఉమాపతిరెడ్డి, చింతంరెడ్డి జానకమ్మ, ఉమా ప్రభాకర్, చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీలు హమానుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మా అమర్నాథరెడ్డి, మాజీ ఎంపీపీ బండి చిన్నరెడ్డి, బీసీ నాయకులు శివగంగాధర్ నాయుడు, నాగేశ్వర్ నాయుడు, సుధాకర, సిద్దయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఖాదర్‌వలీ ఉరుసు



ఉరుసును పురస్కరించుకొని చాదర్‌ను తీసుకొస్తున్న అనీల్‌కుమార్‌రెడ్డి

రాజంపేట టౌన్ : పట్టణంలోని జెండామాను వీధిలో శనివారం రాత్రి హజరత్ ఖాదర్‌వలీ ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉరుసును పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ప్రార్థనలు నిర్వహించారు. దీంతో జెండామాను వీధి కిక్కిరిసింది. ఖవ్వాలి విశేషంగా ఆకట్టుకుంది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి ఉరుసును పురస్కరించుకొని చాదర్ సమర్పించారు. ఉరుసు సందర్భంగా నిర్వాహకులు పేదలకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉరుసు ఉత్సవ కమిటీ ప్రతినిధి అమీర్, వైఎస్సార్ సీపీ నాయకులు జాహీద్‌అలీ, జీవీ.సుబ్బరాజు, అమర తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఏఎస్‌ఐ



మొబైల్‌ను అప్పగిస్తున్న పట్టణ ఏఎస్‌ఐ నరసింహులు

రాజంపేట : రాజంపేట పట్టణ పోలీసుస్టేషన్‌కు చెందిన ఏఎస్‌ఐ నరసింహులు తన నిజాయితీని చాటుకున్నారు. శనివారం పట్టణానికి వచ్చిన పోలి అప్పరాజుపేటకు చెందిన పోలి లక్ష్మీనారాయణ రూ.20వేల విలువ గల మొబైల్‌ను పోగుట్టుకున్నారు. నూనివారిపల్లె రోడ్డులోని వైఎస్సార్‌నగర్ సమీపంలో మొబైల్ పడి ఉండటాన్ని గమనించారు. దీని గురించి విచారించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితున్ని స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్

రాయచోటి : వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. శనివారం రాయచోటి పట్టణ పరిధిలోని చెక్‌పోస్టు శివాలయం నుంచి రవాణా శాఖ ఆధ్వర్యంలో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ర్యాలీని డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాలలో వాహన వినియోగదారులను చైతన్య పరిచేలా చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయన్నారు. సీటు బెల్టు, హెల్మెట్ ధరించడం ప్రతి వాహనదారుడు విధి కావాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. మద్యం సేవించి వాహనం నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా చట్టరీత్యా నేరమన్నారు. 18 ఏళ్లు దాటిన వారంతా చట్టపరంగా మోటార్ వాహనాల లైసెన్సులు తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ వ్యక్తిగత అనుభవం కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. అలాగే బంగ్లా జంక్షన్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు, డ్రైవర్లకు రోడ్డు భద్రతా బ్రోచర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జె.అనీల్‌కుమార్, ఏఎంవీఐ అజయ్ కుమార్, పోలీసు కానిస్టేబుళ్లు, షోరూమ్ డీలర్లు, డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు, డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెన్సీలు, వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి



క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న ప్రజానాట్య మండలి, సీపీఐ అనుబంధ సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : ప్రాచీన కళలను బతికిస్తూ జీవితాలను నెట్టుకొస్తున్న కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు నచ్చు భాస్కర్, కార్యదర్శి జక్కుల వెంకటేష్, జిల్లా ఇన్‌చార్జ్ విశ్వనాథనాయక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ప్రజానాట్యమండలి క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజానాట్యమండలి కళాకారులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నారన్నారు. వీధి నాటకాలు, భరతనాట్యం, సత్యహరిశ్చంద్ర నాటకాల ప్రదర్శన, డప్పు కళాకారులకు పెన్షన్‌లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాల మంజూరుతోపాటు అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, రాయచోటి కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటీశ్వరరావు, రైతు సంఘం జిల్లా నేత వంగిమళ్ళ రంగారెడ్డి, మహిళా సమైక్య నాయకురాలు సుమిత్ర, నేతలు చంద్రాయుడు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

27న ముగ్గుల పోటీలు

సిద్దవటం : మండల పరిధి మాధవరం 1, 2, 3, వార్డుల్లోని భక్త వీరాంజనేయస్వామి ఆలయం ఎదురుగా రథసప్తమి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సీఎస్‌ఆర్ హ్యాండ్లూమ్స్ అధినేత సీఎస్ రాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న మధ్యాహ్నం 1 గంట నుంచి జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. విజేతలకు, పాల్గొన్న వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 25 సాయంత్రం 4 గంటల లోపు 9440728181 అనే నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు.

ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

రాజంపేట టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి, తృతీయ, ఐదవ సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు ఆ యూనివర్సిటీ స్థానిక కోఆర్డినేటర్ ఐఎల్‌ఎన్ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. 2017 నుంచి అడ్మిషన్ పొందిన వారు కూడా ఫీజు చెల్లించి పరీక్షలు రాయవచ్చని వివరించారు.

చేపల వ్యాపారులకు స్థలాలు కేటాయింపు



అధికారులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ అధ్యక్షులు వండాడి వెంకటేశ్వర్లు

రాయచోటి టౌన్ : రాయచోటి రైతు బజార్‌కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని చేపల వ్యాపారం నిర్వహించుకోవడానికి చిరు వ్యాపారులకు అధికారులు కేటాయించారు. శనివారం మార్కెట్ కమిటీ అధ్యక్షులు వండాడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, మత్స్యశాఖ అధికారులు రెడ్డెయ్య, సుస్మితతో కలిసి చిరు వ్యాపారులకు స్థల పరిశీలన చేశారు. ఈ స్థలంలో తమకు తాముగా షెడ్లు వేసుకోవచ్చని వారు చెప్పారు. లేదా బ్యాంక్‌ల ద్వారా రుణాలు పొంది వేసుకోవచ్చని సూచించారు. అలాగే కూరగాయల వ్యాపారం నిర్వహించుకొనే వారికి రైతు బజార్‌లోని గదులలో నిర్వహించుకోవడానికి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి మల్లిఖార్జున, దిన్నెపాడు రవిరాజు, మార్కెట్ యార్డు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలో 2023–24వ ఆర్థిక సంవత్సరానికి చెందిన విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై గురువారం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో విశాఖపట్టణం నుంచి ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఈలు ఎం.సురేంద్రనాథ్, సి.బాలాజీ, బీ మురళీధర్, ఏఈలు ఏ ఉమాపతి, పీ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

లక్కిరెడ్డిపల్లి : బాధిత కుటుంబానికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షాజహాన్ శనివారం ఆర్థిక సాయం అందించారు. మండల కేంద్రంలోని ఆసుపత్రి సమీపంలో నివాసం ఉంటున్న చంద్రమౌళి, ఆయన భార్య ఈ నెల 16న అత్తగారింటికి వెళ్తుండగా గువ్వలచెరువు ఘాట్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడు చికిత్స పొందుతుండటంతో లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షాజహాన్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. మరికొంత మంది దాతలు ముందుకు వచ్చి తమ బిడ్డను ఆదుకోవాలని చంద్రమౌళి తండ్రి రామకృష్ణ కోరారు.

శ్రీ భద్రకాళీ సమేతుడికి అమావాస్య పూజలు



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి అమావాస్య పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి శ్రీ వీరభద్రస్వామి, శ్రీ భద్రకాళీ అమ్మవారి మూల విరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి, భక్తులకు దర్శన సౌకర్యం ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయంలో ఊరేగించారు. ఈ పల్లకీ ఉత్సవం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న లయన్స్ క్లబ్ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ యూనిట్ రోగులకు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆ క్లబ్ అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ మాట్లాడుతూ లయన్ అశోక్ రెడ్డి, లయన్ షేక్ మహమ్మద్, లయన్ శ్యామ్ సుందర్ రెడ్డి, రెడ్డికీర్తి రెడ్డి, డాక్టర్ సులోచన ఆర్థిక సౌజన్యంతో అందించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 60 మంది టీబీ రోగులకు అందజేశామని, వారందరికీ నెలకు ఒకసారి చొప్పున 6 నెలల వరకు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలోఫర్ బేగం మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీబీ రోగులకు దాతల సహకారంతో పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్ర, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ జీవన్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, రెడ్డి కృష్ణ, టీబీ యూనిట్ సూపర్‌వైజర్, హరి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఏపీటీఎఫ్ క్యాలెండర్లును ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

రాయచోటి అర్బన్ : త్వరలో జరగబోయే 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాను అత్యుత్తమ స్థాయిలో నిలిపేందుకు ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన తన కార్యాలయం ఆవరణలో రాయచోటి ఉపవిద్యాశాఖ అధికారిణి వరలక్ష్మితో కలిసి ఏపీటీఎఫ్ క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్బవరం హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఖాదర్‌బాషా, జిల్లా ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామదస్తగిరిరెడ్డి, శ్రీనివాసులు, ఎంఈఓ వెంకటేష్ నాయక్‌తో పాటు పలువురు ఏపీటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విన్నర్ జట్టు ట్రోఫీ, నగదు అందజేస్తున్న గుండ్లూరు శివ

పెనగలూరు : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగారెడ్డిపల్లి వైస్ ప్రెసిడెంటు గుండ్లూరు శివ అన్నారు. సింగారెడ్డిపల్లి పంచాయతీలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను 15 రోజులుగా నిర్వహించారు. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొత్త సింగనమల దళితవాడ విన్నర్‌గా, కంబాలకుంట దళితవాడ రన్నర్‌గా నిలిచింది. విన్నర్ జట్టుకు ట్రోఫీతోపాటు రూ.35 వేలు, రన్నర్ జట్టుకు రూ. 20 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత, విద్యార్థులు సంక్రాంతి సెలవులకు ఇళ్లకు వస్తారనే ఉద్దేశంతో గత 15 రోజులుగా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరిపించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షకు పటిష్ట బందోబస్తు



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం నిర్వహించే పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక రాతపరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ పరీక్ష హాల్‌లోకి పోలీస్ సిబ్బంది వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు.

సీటీఎం రైల్వేస్టేషన్, మదనపల్లె ఆర్టీసీ బస్టాండు, చిత్తూరు బస్టాండు, బెంగళూరు బస్టాండు, నిమ్మనపల్లె క్రాస్‌వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే తమ సిబ్బందిని అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, మురళీకృష్ణ, శివాంజనేయులు, సాదిక్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దర్గా స్వామిజీ ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో విగ్రహాలు

రామాపురం : మండలంలోని దర్బార్ అనంత సాయి నగర్‌లో వెలసిన శ్రీ దర్గా స్వామిజీ ఆరాధనోత్సవాలు శనివారం ముగిశాయి. బెంగళూరుకు చెందిన వేద పండితులు పంచలోహ విగ్రహమైన స్వామి వారి మూలవిరాట్‌కు రుద్రాభిషేకం, గంగపూజ, కలశ స్థాపన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్ర నామార్చన, సాయంత్రం ఊయల ఉత్సవం జరిపారు. హైదరాబాద్ నుంచి భక్తులు, ప్రముఖులు డాక్టర్ భయారెడ్డి పూజల్లో పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

నిమ్మనపల్లె : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న సమగ్ర రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ సీ.ఆర్.మంజుల అన్నారు. శనివారం తవళం గ్రామంలో సమగ్ర రీసర్వేపై గ్రామసభను నిర్వహించారు. సర్పంచ్ రెడ్డెప్ప, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సిరాజుద్దీన్, ఆర్ఐ.రాంప్రసాద్ పాల్గొన్నారు.